# సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 18 । జూలై । 2023






## రేషన్ కష్టాలకు తెర

గిరి శిఖర గ్రామాల రేషన్ కష్టాలకు తెర పడింది. ట్రాక్టర్ల ద్వారా సరుకులు పైకి పంపుతున్నారు.

- IIలో



## అదుపు తప్పిన బైక్

బైక్ అదుపు తప్పి ఓ యువకుడు కాళ్లు పోగొట్టుకున్నాడు. చాకిపల్లి వద్ద ప్రమాదం జరిగింది.

- IIలో

## ఆధునిక మరుగుదొడ్లు సిద్ధం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల కోసం ఆధునిక రీతిలో మరుగుదొడ్ల బ్లాకులను సిద్ధం చేశారు. ఉచిత దర్శనాల క్యూలైన్ కాంప్లెక్స్‌కు అనుసంధానంగా వీటిని పలువురు భక్తులు ఇచ్చిన విరాళాలతో నిర్మించారు. ఇప్పటికే రన్నింగ్ వాటర్ సౌకర్యాన్ని కూడా సిద్ధం చేశారు. కేశఖండన శాల వెనుక భాగంలో కూడా 32 మరుగుదొడ్ల బ్లాకులను కూడా సిద్ధం చేస్తున్నారు.

## న్యూస్‌రీల్

### 'జగనన్న తోడు'కు సిద్ధం

- నేడు లబ్ధిదారులకు వడ్డీలేని రుణం అందజేత
- జిల్లాలో 22,794 మంది లబ్ధిదారులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: చిరు వ్యాపారులను ఆదుకునేందుకు అమలు చేస్తున్న జగనన్న తోడు ఏడో విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నారు. ఈ పథకం ద్వారా చిరు వ్యాపారులకు, సంప్రదాయ వృత్తిదారులకు రూ.10 వేలు వడ్డీ లేని రుణం అందజేస్తారు. జిల్లా కేంద్రంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ పథకం ఇప్పటికే జిల్లాలో ఆరు సార్లు రుణాలు పంపిణీ చేశారు. ఆరు విడతల్లో జిల్లాలో 92, 540 మందికి గాను రూ. 92.54 కోట్ల రుణ ప్రయోజనం చేకూరింది. ఏడో విడతలో 22,794 మంది లబ్ధిదారులకు రూ. 22.80 కోట్ల ప్రయోజనం చేకూరుతోంది.

### 'రీ సర్వేలో తప్పులు ఉండకూడదు'

అరసవల్లి: జిల్లాలో రీసర్వే పనుల్లో ఎక్కడా తప్పులు జరగకూడదని, తప్పులు చేసిన వారిపై చర్యలకు వెనుకాడేది లేదని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ హెచ్చరించారు. ఆయన సోమవారం సాయంత్రం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శ్రీకాకుళం డివిజన్ సర్వేయర్లతో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే ప్రక్రియ ఈనెలాఖరులోగా పూర్తి కావాల్సిందేనని సూచించారు. ఇప్పటివరకు చేపట్టిన మండలాల వారీగా కలెక్టర్ ఆరా తీశారు. చాలా మండలాల్లో పనుల జాప్యంపై తహసీల్దార్లు వివరణ ఇచ్చారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వారిని ఆదేశించారు. జేసీ నవీన్ మాట్లాడుతూ సకాలంలో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈనెల 27 నాటికి ఫారం-8 జనరేట్ చేయాలని, గ్రౌండ్ వేలిడేషన్ పూర్తయిన ప్పటికీ వీఆర్వో లాగిన్‌లో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు.

### సీఐలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు సంబంధించి పలువురు సీఐలకు స్థానచలనం కల్పిస్తూ విశాఖపట్నం రేంజి కార్యాలయం నుంచి ఉత్తర్వులు ఇచ్చినట్లు జిల్లా పోలీసు కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు జిల్లా క్రైమ్ రికార్డు బ్యూరో (డీసీఆర్‌బీ) సీఐగా ఉన్న బూర ప్రసాదరావును నరసన్నపేట సీఐగాను, నరసన్నపేట సీఐగా ఉన్న దుక్క రాము విశాఖ రేంజి వీఆర్‌లోకి, విశాఖపట్నం రేంజి వీఆర్‌లో ఉన్న డి.నవీన్‌కుమార్, కె.లక్ష్మణమూర్తిలను శ్రీకాకుళం డీసీఆర్‌బీ, డీఎస్‌బీ (జిల్లా స్పెషల్ బ్రాంచి) సీఐలుగా బదిలీ చేస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఆటో వర్క్‌షాపులో అగ్నిప్రమాదం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని ఓ ఆటో వర్క్ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం అగ్నిప్రమాదం సంభవించి రూ. 3 లక్షల మేర నష్టం సంభవించినట్లు జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి వరప్రసాదరావు పేర్కొన్నారు. ఆయన చెప్పిన వివరాల మేరకు.. పాత దీపామహల్ పక్కన ఉన్న శ్రీ సాయి నీల ఆటోవర్క్ షాప్ షట్టర్‌ను ఉదయం తెరవగానే పొగ, మంటలు చెలరేగి రావడంతో అప్రమత్తమైన షాపు యాజమాన్యం ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. వెనువెంటనే గురువారెడ్డి, పాపారావు, రమణ, కూర్మారావులతో కూడిన ఫైర్‌సిబ్బంది టెండరింగ్ ఇంజిన్‌తో వచ్చి ఫోమ్, వాటర్‌ను షాపులోకి ప్రెషర్ ద్వారా కొట్టి మంటలను అదుపు చేశారు. లోపలికి వెళ్లి చూడగా పాత ద్విచక్రవాహనాలు ఎనిమిది, టైర్లు, ఆయిల్ అన్నీ కాలిపోయి ఉన్నాయి.

# పౌర సేవ.. ఇంత సులువా!

- 'జగనన్న సురక్ష'తో ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలు పొందుతున్న జనం
- అడిగిన వెంటనే ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న వైనం
- ఈ నెల 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం
- ఇప్పటివరకు లక్షా 70వేలకు పైగా సేవలు పొందిన ప్రజలు

### గతంలో..

ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ఒక సర్పంచో, ఎంపీటీసీయో, మరో గ్రామ స్థాయి నాయకుడినో తీసుకెళ్లాలి. వారు ఖాళీ ఉన్న రోజునే వెళ్లాల్సిన పరిస్థితి. దాని కోసం వారి చేతులు తడపాలి. భోజనం, ప్రయాణ ఖర్చులు పెట్టుకోవాలి. ఇంత వ్యయ ప్రయాసలతో వెళ్లాక అక్కడ ఆ విభాగం అధికారి ఉంటే ఫర్వాలేదు. లేదంటే మళ్లీ తడిసి మోపెడయ్యేది. దీనికితోడు పార్టీలను చూసేవారు. తమ వాళ్లయితేనే పని చేసి పెట్టేవారు. కేవలం ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసమే అంత ప్రయాస పడాల్సి వచ్చేది. ఇక, పట్టాదారు పాసు పుస్తకాలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డులు తదితర వాటికైతే ఎన్ని రోజులు తిరగాలో చెప్పలేని పరిస్థితి.

### మరి ఇప్పుడో..

ఊళ్లోనే గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాయి. సిబ్బంది అందుబాటులోకి వచ్చారు. వలంటీర్ ఇంటికే వచ్చి అడుగుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేసింది. ప్రజల కులం, మతం, ఏ రాజకీయ పార్టీ అని చూడకుండా, వివక్ష చూపకుండా ఇంటి వద్దకే అన్ని పథకాలు అందిస్తున్నారు. ప్రజలకు కావల్సిన పనులను ఇంటి దగ్గరే చేసి పెడుతున్నారు.

### సమస్య పరిష్కరించారు



నా పేరు వాతాబత్తుల లక్ష్మి. మాది గార మండలం కళింగపట్నం పంచాయతీ నగరప్పాలెం గ్రామం. నేను, మా అత్త వేర్వేరుగా జీవిస్తున్నప్పటికీ హౌస్ మ్యాపింగ్ సెపరేట్ కానందున ప్రభుత్వం అమలు చేసే ఏ సంక్షేమ పథకానికి అర్హత సాధించలేకపోయాను. ఈ నెలలో ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు మా డాక్యుమెంట్స్‌ను పరిశీలించి సమస్యను పరిష్కరించారు.



ఇచ్ఛాపురం రూరల్: అరకభద్రలో సోమవారం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పిరియా సాయిరాజ్ తదితరులు

| | |
|---|---|
| ఆదాయ ధ్రువీకరణ పత్రాలు | 75,947 |
| ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు | 75,377 |
| ఓబీసీ సర్టిఫికెట్లు | 733 |
| ఆధార్ కార్డు మొబైల్ నంబర్ అప్‌డేట్ | 12,094 |
| కౌలు రైతు కార్డులు | 55 |
| రేషన్ కార్డులో అదనపు సభ్యుల చేర్పు | 246 |
| కొత్త రేషన్ కార్డులు | 24 |
| రేషన్ కార్డు తొలగింపు సేవలు | 219 |
| రేషన్ కార్డు విభజన సేవలు | 231 |
| హౌస్ హోల్డ్ మ్యాపింగ్ విభజన సేవలు | 207 |
| కంప్యూటరైజ్డ్ అడంగల్ సర్టిఫికెట్లు | 111 |
| ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు | 156 |
| ఆర్ఓఆర్ 1బి సర్టిఫికెట్లు | 2693 |
| కొత్త ఆరోగ్య శ్రీ కార్డులు | 61 |
| ఆరోగ్య శ్రీ కార్డుల అప్‌డేట్ | 68 |
| వివాహ సర్టిఫికెట్లు | 86 |

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

పౌర సేవ ఇంత సులువా.. అన్న రీతిలో వైఎస్సార్‌సీపీ పాలన సాగుతోంది. జగనన్న సురక్ష అనే వినూత్న కార్యక్రమాన్ని సేవా యజ్ఞంగా ఈనెల ఒకటో తేదీ నుంచి విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఆ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడటంతో పాటు జనన, మరణ, కుల, ఆదాయ, సీసీ ఆర్సీ, రేషన్ కార్డు విభజన వంటి 11రకాల ధ్రువపత్రాలను అందజేస్తున్నారు. ఇలాంటి కార్యక్రమం గతంలో ఎప్పుడూ చూడలేదంటూ సేవలు పొందిన వారంతా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, వివిధ ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. వలంటీర్లు వారం పాటు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసి సర్టిఫికెట్లు, పథకాల అర్హతతో పాటు ప్రభుత్వ సేవలకు సంబంధించి ఏవైనా పెండింగ్ సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తున్నారు.

| శాఖల వారీగా సేవలు | |
|---|---|
| రెవెన్యూ | 1,56,338 |
| ఆధార్ | 12077 |
| సివిల్ సప్లయిస్ | 726 |
| జీఎస్‌డబ్ల్యూఎస్ | 257 |
| వ్యవసాయ శాఖ | 155 |
| వైద్య ఆరోగ్యశాఖ | 129 |
| రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ | 85 |
| మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ | 41 |

**సర్వీసు చార్జీ లేకుండా..**



ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా ఆదాయ ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ పత్రం, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు (కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు), మరణ ధ్రువీకరణ పత్రం, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు, వివాహ ధ్రువీకరణ పత్రం (పట్టణాల్లో అయితే 90రోజుల్లోగా), గ్రామీణ ప్రాంతాల్లో నైతే 60రోజుల లోపు), ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో కొంత మంది సభ్యుల పేర్ల తొలగింపు వంటి వాటిని అందిస్తున్నారు. క్యాంపులు నిర్వహించే తేదీని ప్రజలకు వాళ్ల ఫోన్స్‌కు ముందుగా మెసేజ్ పంపడమే కాకుండా పబ్లిక్ అనౌన్స్‌మెంట్, వలంటీర్ల ద్వారా ముందుగా తెలియజేస్తున్నారు.

**జోరుగా సర్వే..**

జిల్లాలో 30 మండలాల్లోని 732 సచివాలయాలకు గాను 441 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష శిబిరాలు ఇప్పటి వరకు నిర్వహించారు. జిల్లాలో 7,28,810 హౌస్ హోల్డ్స్ సర్వే నిర్వహించాల్సి ఉండగా 5, 22,819హౌస్ హోల్డ్స్ సర్వే పూర్తయింది. ఇందులో భాగంగా జూలై 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు లక్షా 70వేల 24మంది పౌరులకు వారు కోరిన వివిధ రకాల ధ్రువపత్రాలను త్వరితంగా, ఉచితంగా అందజేశారు.

### సమస్య తీరింది



మాది సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామం. నేను కౌలు రైతును. ఎప్పటి నుంచో కౌలు రైతు కార్డు కోసం ఎదురు చూస్తున్నాను. కానీ, నిరీక్షణే మిగిలింది. ఇప్పుడా సమస్య తీరింది. ఈనెల 10న కౌలు రైతు కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా, దరఖాస్తు చేసిన రెండు గంటల్లోనే మండల అధికారులు అందరూ కౌలు రైతు కార్డు తయారు చేసి ఇచ్చారు.

– పైడి తులసీరావు, పురుషోత్తపురం

### జగనన్న సురక్ష నాకు శ్రీరామ రక్ష



మాది పలాస మండలం టిక్కలిపట్నం పంచాయతీ పరిధిలోని సవరపేట గ్రామం. నా భర్త మూడేళ్ల క్రితం బ్లడ్ కేన్సర్‌తో మృతి చెందారు. అప్పటి నుంచి వితంతు పింఛన్ కోసం ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. ఇదే విషయమై వలంటీర్‌ను అడిగితే హౌస్ మ్యాపింగ్ డివైడింగ్ కానందున పింఛన్ రావడం లేదని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో నా సమస్యను ఇంటికి వచ్చి మరీ పరిష్కరించారు. నాలాంటి వారికి అండగా నిలిచిన జగనన్నకు కృతజ్ఞతలు.

– ఎస్. పార్వతీ, సవరపేట.

### పైసా ఖర్చు లేకుండా



మాది కంచిలి మండలం కొరువూరు పంచాయతీ చింతల గ్రామం. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసిన ఒక్క రోజులోనే అవన్నీ నా చేతికొచ్చాయి. గతంలో ఎన్నో సార్లు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం ఎన్నడూ లేని విధంగా పైసా ఖర్చు లేకుండా కేవలం 24 గంటల్లోగా ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు ఉచితంగా పొందడం సంతోషంగా ఉంది.

– పైడి దాలయ్య, చింతల గ్రామం.

### ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ భావోద్వేగం



మబగాంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

పోలాకి: మబగాంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణదాస్ మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తన రాజకీయ ఆరంగేట్రం, వైఎస్‌ఆర్ మరణం తర్వాత వైఎస్సార్‌సీపీ లోకి వెళ్లడం, సోదరుల మధ్య రాజకీయ పోటీ ఏర్పడటం, జగన్‌మోహన్‌రెడ్డి తనను ఆదరించిన తీరును గ్రామస్తులతో చెప్పుకుంటూ కంటతడి పెట్టుకున్నారు. నేటి రాజకీయాలు కుట్రలతో నిండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తన స్వగ్రామానికి ఏం కావాలో తనకు తెలుసునని, మబగాం అభివృద్ధికి ఎన్నడూ ముందుంటానని కృష్ణదాస్ చెప్పారు. గ్రామంలో ఇళ్లు లేని పేదల కోసం తన సొంత పొలం ఇవ్వటానికి సైతం సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.

### వైద్యులపై డీసీహెచ్‌ఎస్ ఆగ్రహం



వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీసీహెచ్‌ఎస్ భాస్కరరావు

పొందూరు: స్థానిక సీహెచ్‌సీకి వైద్యులు 10.30 గంటలైనా రాకుండా నిర్లక్ష్యం చూపడంపై డీసీహెచ్‌ఎస్ జె.భాస్కరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొందూరు సీహెచ్‌సీకి వైద్యులు సకాలంలో రావటం లేదని 10 గంటల సమయంలో రోగులు ఫోన్ చేయడంతో డీసీహెచ్‌ఎస్ బయల్దేరి 11.45 గంటలకు చేరుకున్నారు. వైద్యుల ఆలస్యంపై వివరణ ఇవ్వాలని వైద్యులను, సూపరింటెండెంట్ రామదాస్‌ను అడిగారు. వైద్యులను వెనుకేసుకుని రావడానికి సూపరింటెండెంట్ ప్రయత్నించడంతో ఆయనపై మండిపడ్డారు. వైద్యులకు మెమోలు జారీచేస్తున్నట్లు తెలిపారు.

### 'మహాసభలు జయప్రదం చేయండి'

కాశీబుగ్గ: పలాసలో ఈ నెల 22, 23వ తేదీల్లో జరగనున్న అంగన్‌వాడీ (సీఐటీయూ) యూనియన్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి నెయ్యిల గణపతి కోరారు. పలాసలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి నేతలు హాజరయ్యే కార్యక్రమానికి అందరూ రావాలన్నారు.

## కల్లోల కడలి



అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో అలలు



కెరటాల తాకిడికి కోతకు గురైన అక్కుపల్లి శివసాగర్ తీరం

వజ్రపుకొత్తూరు రూరల్: వాతావరణంలో ఏర్పడిన మార్పులతో కడలి కల్లోలంగా మారింది. గుణుపల్లి, మెట్టూరు, నువ్వలరేవు, మంచినీళ్లపేట, కంబాలరాయుడు పేట, డోకులపాడు, హుకుంపేట తీరాల్లో సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. అక్కుపల్లి శివసాగర్ తీరంలో సముద్రం సుమారు 60 మీటర్లు ముందుకు రావడంతో తీరం కోతకు గురైంది. దీంతో మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు. సముద్రంలో వాతావరణ పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఇప్పటికే మత్స్యకారులు బోట్లు, వలలు, తెప్పలను తీరానికి చేర్చారు. కాగా ఆదివారం సాయంత్రం నుంచి జోరుగా వర్షం కురుస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షం నీరు రోడ్లుపైకి చేరడంతో రహదారులు జలమయమయ్యాయి.

## 'బాడీ బిల్డింగ్‌కు ఆదరణ పెరగాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ:

బాడీబిల్డింగ్‌కు మరింత ఆదరణ పెరగాలని, ప్రభుత్వం తరఫున అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. త్వరలో జరిగే ఆలిండియా బాడీబిల్డింగ్ పోటీల పోస్టర్‌ను ఆయన సోమవారం శ్రీకాకుళంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ క్రీడలు, వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో చిన్న వయసులోనే అనారోగ్యం బారిన పడుతున్నారని.. అందుకు వ్యాయామం, యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ గోపీ, ఫ్లెక్స్ జిమ్ అధినేత కొమ్మాన గౌరీ శంకర్, కరాటే శిక్షకులు రెడ్డి ఢిల్లీశ్వరరావు, బుక్కా యుగంధర్, హరీష్, బంకు రాజు, గణేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి కూడా పోస్టర్‌ను తన నివాసంలో ఆవిష్కరించి అవసరమైన సాయం చేస్తానన్నారు.



బాడీబిల్డింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, నిర్వహణ కమిటీ ప్రతినిధులు, జిమ్‌ల ప్రతినిధులు

# పచ్చనేత.. శిలాఫలకాల వెక్కిరింత!

- నరసన్నపేటలో బస్సు యాత్రకు సిద్ధమైన రమణమూర్తి
- అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గాన్ని పట్టించుకోని వైనం
- కృష్ణదాస్ హయాంలో జోరుగా పనులు
- బస్సు యాత్రపై నివ్వెరపోతున్న ప్రజలు

నరసన్నపేట, పోలాకి, సారవకోట, జలుమూరు: జన్మభూమి కమిటీల ఆగడాలు.. ఇసుక, మట్టి మాఫియాలతో అక్రమాలు.. యథేచ్ఛగా ప్రభుత్వ నిధుల దోపిడీలు.. నరసన్నపేటలో అధికారంలో ఉన్నన్నాళ్లూ బగ్గు రమణమూర్తి పాలన సాగిన తీరు ఇది. ఆయన హయాంలో ఎక్కడికక్కడ వేసిన శిలాఫలకాలు ఇప్పటికీ టీడీపీ నేతలను వెక్కిరిస్తున్నాయి. ఆ పాలనపై విసుగు చెందే 2019లో ఈ నియోజకవర్గ ప్రజలు ధర్మాన కృష్ణదాస్‌కు ఓటేసి గెలిపించుకున్నారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో ప్రగతి పనులు ఊపందుకున్నాయి. కానీ మళ్లీ బగ్గు రమణమూర్తి అధికారం కోసం బస్సు యాత్ర అంటూ ప్రజల ముందుకు వస్తున్నారు. అవకాశం ఇచ్చినప్పుడు జనం కోసం పనిచేయకుండా ఇప్పుడు యాత్రలెందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



నరసన్నపేట మండలం మడపాం వద్ద బగ్గు రమణమూర్తి వేసిన శిలాఫలకం

### టీడీపీ మోసాలు..

హామీల మూటలు

- పోలాకి మండలం వనిత మండలం వద్ద వంశధార నదిపై వంతెన నిర్మిస్తామని చేయలేదు.
- కాలువలు ఆధునికీకరిస్తామని మట్టి పనులతో సరిపెట్టేశారు.
- మత్స్యకారులకు రాజాపురం వద్ద ఫిషింగ్ డ్రై ప్లాట్‌ఫారం నిర్మాణాన్ని గాలికి వదిలేశారు.
- సారవకోట మండలం నుంచి మాకివలస మీదుగా జలుమూరు మండలం మర్రివలస వరకూ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం వేసి వదిలేశారు.
- తర్లి, లక్ష్మీపురం, మూగపురం, కూర్మనాథపురం, గొర్రిబంద గ్రామాలకు రోడ్లకు శిలాఫలకాలు మాత్రమే వేశారు.
- మడపాం వద్ద ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. ఎన్నికల స్టంట్‌గా మిగిలిపోయింది.
- జలుమూరు మండలం పర్లాం నుంచి మాకివలస మీదుగా గంగన్నపేటకు కలుపుతూ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేశారు.
- జేజే రోడ్డు నుంచి యలమంచిలి మీదుగా అక్కరాడను కలుపుతూ రోడ్డు వేస్తామని వేయలేదు.

### వైఎస్సార్ సీపీ చేసిన పనులు..

అభివృద్ధి జాడలు

- నరసన్నపేట పట్టణంలో పోలాకి కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ రోడ్డును విస్తరించి నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేశారు.
- పోలాకి రోడ్డులో ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని పూర్తి చేయించారు.
- నియోజకవర్గంలో ప్రధాన రోడ్లు కోమర్తి-బద్రి, లుకలాం-కొమనాపల్లి, జర్జంగి-శ్రీముఖలింగంల మధ్య రోడ్లు అభివృద్ధి చేశారు.
- సారవకోట మండలంలో బొంతు పీహెచ్‌సీకి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించారు.
- కొమనాపల్లి వద్ద వంశధారపై వంతెన పనులు పూర్తి చేసి ఇక్కడి ప్రజల చిరకాల కోరికను తీర్చారు.
- నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకలకు విస్తరించి నలుగురు వైద్యుల సంఖ్యను 23కు పెంచారు.
- పిన్నింటిపేటలో షాపింగ్ కాంప్లెక్స్ ఏడాదిలోపే ప్రారంభించి అక్కడి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.
- గంగివలస, జిల్లోడుమాకివలస, రాళ్ల గోదాయవలస, కుసుమపోలవలస గ్రామాలకు చిరకాల కోరిక అయిన సీసీ రహదారులను రూ. 80 లక్షలతో నిర్మించారు.
- గుప్పడిపేట, పోలాకి, మాకివలస, ఉర్లాం పీహెచ్‌సీలు రూ. 2.80 కోట్లతో అభివృద్ధి చేశారు.
- నరసన్నపేటలో రూ.2.50 కోట్లతో నర్సింగపల్లి, అంప్లాం, కొటారపల్లి, గోకయ్యవలస రోడ్ల పనులు పూర్తి చేశారు.



మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.1.20 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ అగ్రిల్యాబ్



అద్దంలా కోమర్తి-బద్రి రోడ్డు

### చర్చకు రాగలరా..



ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ టీడీపీ నాయకులు ఓట్ల కోసం యాత్రలు నిర్వహిస్తున్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలు గాలికి వదిలేసి ఇప్పుడు మళ్లీ అధికారం కోసం అర్రులు జాస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలోని ఈ నాలుగేళ్లలో ఏం చేశామో మేం చెప్పగలం. దీనిపై చర్చకు రాగలరా.?

– కరిమి రాజేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్, ఎదుళ్లవలస, పోలాకి మండలం

### మొసలి కన్నీరు



మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే కృష్ణదాస్‌ల కృషితో ఓపెన్ హెడ్‌చానల్స్ ఆధునికీకరణకు రూ. 70 కోట్ల నిధులు తెస్తే అప్పట్లో నాణ్యమైన పనులు చేయలేదు. అలాగే రైతుల ఓట్లు కోసం మడపాం వద్ద ఎత్తిపోతల పథకానికి ఆదరాబాదరాగా ఎన్నికల ముందు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా శిలాఫలకం వేసి రైతులకు మోసం చేశారు. ఇప్పుడు ఏదో చేస్తామని మళ్లీ ఎవరిని మోసం చేస్తారు.

– కనపల శేఖరరావు, కోమర్తి మాజీ నీటి సంఘం అధ్యక్షుడు, పోతయ్యవలస

## క్లుప్తంగా

### కళా గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: క్లోపల్లిలోని సంప్రదాయ కళా గురుకులంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కూచిపూడి నృత్యంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు గురుకులం డైరెక్టర్ స్వాతీసోమనాథ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గురుకులం గుర్తింపబడినట్టు పేర్కొన్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అనుబంధంగా కోర్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ చేరేవారికి హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9440681083, 7731909837 నంబర్లను సంప్రదించాలన్నారు.

### తెగిపడిన విద్యుత్ వైర్లు

- తప్పిన పెను ప్రమాదం



తెగిపడిన విద్యుత్ తీగ

శ్రీకాకుళం: శ్రీకాకుళం జి.టి.రోడ్డులోని పందుంపుల్లల జంక్షన్‌లో సోమవారం ఉదయం పెనుప్రమాదం తప్పింది. జనం రద్దీగా ఉన్న పది గంటల సమయంలో విద్యుత్ హైటెన్షన్ వైరు పెద్ద శబ్దంతో తెగిపోయింది. దీంతో అక్కడ ఉన్నవారంతా భయంతో పరుగులు తీశారు. అయితే వైరు పడిన చోటే ఉండిపోవడం.. అక్కడ మున్సిపాలిటీకి చెందిన చెత్త కుండీ మాత్రమే ఉండడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. సమీపంలోని వారు విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించడంతో సిబ్బంది తక్షణం సరఫరాను నిలిపివేశారు. కొద్ది సేపటి తరువాత సిబ్బంది చేరుకొని మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

### సొండిపూడి విద్యార్థుల ప్రతిభ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మందస: సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఫైర్ అండ్ సేఫ్టీ అనే అంశంపై జరిగిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థులు సాధించారు. సాయిగౌతమి పాణిగ్రాహి, బాడ శ్రీకాంత్, బాడ శ్రీజలకు జనరల్ మేనేజర్ కె.రామచందర్ సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.ఎస్.సాల్మన్‌అనిల్, ఉపాధ్యాయులు నగిరి కరుణాకర్ పాల్గొన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్ వ్యవహారాన్ని సక్రమం చేసే యత్నాలు

అరసవల్లి: అరసవల్లి లక్ష్మీనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ శాఖకు చెందిన కొందరు ఇంజినీరింగ్ అధికారులు సర్దుబాట్లుతో ఫీట్లు చేస్తున్నారు. ఈనెల 3న సాక్షిలో 'ఇదేం తీరు 'పేరిట కథనం ప్రచురితం కావడంతో డీ–1 ఏఈ కమల్‌హాసన్ ఈ వ్యవహారంపై శాఖాపరమైన విచారణకు ఆదేశించిన సంగతి విదితమే. అయితే ఈ వ్యవహారంలో జనరల్ మేనేజర్ చలపతిరావు విచారణ నివేదికను ఉన్నతాధికారులను అందించగా.. స్థానిక విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఈ వ్యవహారంలో లోతుగా విచారణ చేస్తున్నారు. ఈ విచారణలో.. ఎలాగైనా సర్దుబాట్లు చేసేలా కొందరు విద్యుత్ శాఖ సిబ్బంది ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు తెలిసింది.

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24కి. 10గ్రా.) | 59,980–00 |
| బంగారం(22కి. 10గ్రా.) | 54,980–00 |
| వెండి (కిలో) | 81,500–00 |

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు) | |
|---|---|
| విశాఖపట్నం | రూ. 475.00 |
| విజయనగరం | రూ. 479.00 |
| శ్రీకాకుళం | రూ. 479.00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹112 | ₹194 | ₹ 204 |



# రేషన్ కష్టాలకు తెర!

- ట్రాక్టర్ ద్వారా గిరి శిఖర గ్రామాలకు రేషన్ సరఫరా
- కాలినడక కష్టాలు తప్పడంతో ఆనందంలో గిరిజనం
- ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషిని అభినందిస్తున్న వైనం

మెళియాపుట్టి:

ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ సరుకుల కోసం అమాయకులైన గిరిజనులు అనేక ఇబ్బందులు పడేవారు. ఎత్తైన కొండలపై ఉన్న గ్రామాల నుంచి కాలినడకన దిగి మైదాన ప్రాంతానికి చేరుకుని బియ్యాన్ని తీసుకోవడానికి పడరాని కష్టాలు పడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితికి తెర పడింది. గిరిశిఖరాన ఉన్న గ్రామాలకే నేరుగా రేషన్ సరుకులు చేరుతున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలతో వారి కష్టాలు కనుమరుగయ్యాయి. రేషన్ కోసం దశాబ్దాలుగా పడిన కష్టాలకు తెరపడడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మెళియాపుట్టి మండలంలోని ఎత్తైన గిరిజన గ్రామాలకు చెందిన గిరిజన లబ్ధిదారులకు సరుకులు అందించేందుకు గత ప్రభుత్వాలు పెద్దగా ఆసక్తి చూపేవికాదు. మైదాన ప్రాంతంలో ఉండే డీలరు వద్దకు కొండల పైనుంచి గిరిజనులు దిగి సరుకులను విడిపించుకునేవారు. తిరిగి వాటిని నెత్తిన పెట్టుకుని వారి గ్రామాలకు నడిచి వెళ్లేవారు. దీంతో రోజంతా వృథా అయ్యేది. ఆ కష్టాలు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చాక తీరిపోయాయి. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో గిరిజనుల ఇంటి ముంగిటకే సరుకులు అందుతున్నాయి.



చందనగిరిలో రేషన్ సరుకులు పంపిణీ చేస్తూ..



కొండపైనున్న చందనగిరిలో ట్రాక్టర్ నుంచి రేషన్ సరుకులు దించుతున్న దృశ్యం

#### చందనగిరి సమస్య ఇది..

మెళియాపుట్టి మండలం చందనగిరి గిరిజన గూడకు చెందిన గిరిజనులు ఎండైనా, వానైనా కొండ దిగి వచ్చి రేషన్ సరుకులు తీసుకుని వెళ్లాల్సి వచ్చేది. ఈ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేదు. చందనగిరి గ్రామాన్ని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కాలినడక ఇటీవల సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులు వారి సమస్యలను ఆమెకు చెప్పుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. దీనికి స్పందించిన అధికారులు ట్రాక్టర్ వెళ్లేందుకు వీలుగా రోడ్డును ఏర్పాటు చేశారు. నెలకు రూ.22 వేలు అద్దె చెల్లించి ట్రాక్టర్ ద్వారా రేషన్ సరుకులు గిరి శిఖర గ్రామాలకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. రెండు నెలలుగా చందనగిరితో పాటు కేరాసింగి, గూడ, వీరన్నపేట, ముత్యాలబొంతు, గొట్టిపల్లి, దబ్బగుడ్డి, పెద్దకేదారి, హడ్డివాడ గ్రామాలకు చెందిన గిరిజనులకు వారి ఇళ్ల వద్దకే సిబ్బంది వెళ్లి రేషన్ సరుకులు అందిస్తున్నారు. గిరిజనులు ఎనలేని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

#### ఎమ్మెల్యేకు రుణ పడి ఉంటాం



మండుటెండల్లో కాలినడకన కొండలు దిగి కిందికి వచ్చి రేషన్ సరుకులు తీసుకొని మోసుకొని వెళ్లేవాళ్లం. ఇప్పటివరకూ తమ బాధను వినే నాథుడే కరువయ్యారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతమ్మ మా గ్రామానికి వస్తే బాధలను చెప్పుకున్నాం. ఆమె కృషితో మా కష్టాలు తీరాయి. ఎమ్మెల్యేకు, సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

–జన్ని సరోజిని, చందనగిరి, మెళియాపుట్టి

#### కష్టాలను చూసి బాధేసింది



కొండల పైనుంచి రేషన్ సరుకుల కోసం గిరిజనులు కాలినడకన కిందికి దిగుతున్నట్టు తెలుసుకొని బాధపడ్డాను. గిరిశిఖర గ్రామాలకు వెళ్లి వారి కష్టాలను కళ్లారా చూశాను. జిల్లా స్థాయి అధికారుల సహకారంతో పౌరసరఫరాలశాఖ కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లాను. ప్రస్తుతం గిరిజనుల కష్టాలు తీరాయి. ఎమ్మెల్యేగా వారికష్టాలు తీర్చడం ఆనందంగా ఉంది. గిజనాభివృద్ధికి పెద్దపీట వేసిన వ్యక్తి జగనన్న కాబట్టే ఇది సాధ్యమైంది.

–రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

#### ఉన్నతాధికారుల సహకారంతోనే..



గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యను సబ్‌కలెక్టర్ దృష్టిలో పెట్టాను. జిల్లా స్థాయి అధికారుల సహకారంతో.. పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటరమణతో కలసి ఆయా గ్రామాల రహదారులను, గ్రామాలను సందర్శించి నివేదికను అధికారులకు అందించాను. దీనికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి సహకరించారు. ఇప్పుడు ట్రాక్టర్ ద్వారా గిరిజనుల ఇళ్ల వద్దకే రేషన్ తీసుకొని వెళ్లి పంపిణీ చేస్తున్నాం.

–సరోజిని, తహసీల్దారు, మెళియాపుట్టి

## బ్రీత్ ఎన్‌లైజర్లు, టార్చ్‌లైట్ల అందజేత



బ్రీత్ ఎనలైజర్లు, టార్చ్‌లైట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: పోలీసు సేవలకు ఉపయోగపడే బ్రీత్ ఎనలైజర్స్, టార్చ్‌లైట్లను యాక్సిస్ క్లినికల్స్ లిమిటెడ్ ప్రతినిధులు ఎస్పీ జి.ఆర్.రాధికకు తన కార్యాలయంలో సోమవారం కలిసి అందించారు. శ్రేస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్‌ఆర్) కింద పోలీసుకు అనునిత్యం విధి నిర్వహణలో ఉపయోగపడే 15 బ్రీత్ ఎనలైజర్స్, 20 టార్చ్‌లైట్లను ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులకు ఎంతగానో ఉపయోగపడే సామగ్రిని అందించడం అభినందనీయమని కొనియాడారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని గుర్తించడానికి బ్రీత్ ఎనలైజర్‌లు, రాత్రిపూట గస్తీ నిర్వహించే పోలీసు సిబ్బందికి టార్చ్‌లైట్లు ఉపయోగపడతాయన్నారు. అరబిందో ఫార్మాసూటికల్స్, దాని బృందం అందిస్తున్న సేవల్లో భాగంగా కంపెనీ అడ్మినిస్ట్రేటివ్ హెడ్ పి.గోపాలకృష్ణారెడ్డి, హెచ్‌ఆర్ జనరల్ వింగ్ మేనేజర్ కె.కమలాకర్‌రెడ్డిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, యర్రగుంట శృతి, ఎస్.బాలరాజు, జె.ఆర్.పురం సీఐ ఆదాం, ఎస్‌ఐ రాజేష్, అరబిందో కంపెనీ సభ్యులు ఉన్నారు.

## నేడు, రేపు వినూత్న బోధన, పరిశోధన అంశాలపై సదస్సు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మంగళ, బుధవారాల్లో ఉన్నత విద్యా సంస్థల్లో వినూత్న బోధన, పరిశోధన అంశాలపై సదస్సు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ సి.హెచ్.ఎ.రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చంద్రమోహన్, బీఆర్‌ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు హాజరు కానున్నారని చెప్పారు. సెమినార్ కన్వీనర్‌గా కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలం సంతోష్ రంగనాథ్ వ్యవహరిస్తారన్నారు.

#### బీసీడీఈ సమన్వయకర్తలకు శిక్షణ రేపు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 19న ఏఫిలియేషన్ కాలేజీల బీసీడీఈ (బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ త్రూ ఎడ్యుకేషన్ ) సమన్వయకర్తలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వర్సిటీ బీసీడీఈ అధికారి బి.అజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి, బీసీడీఈ రాష్ట్ర కార్యాలయం, యునిసెఫ్‌లు సంయుక్తంగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి నిపుణులు, వర్సిటీ అధికారులు హాజరవుతారన్నారు.

## ఏడుగురికి షోకాజ్ నోటీసులు జారీ



స్పందన వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన ఫిర్యాదులను జాప్యం చేయకుండా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.బిలాఠకర్ సూచించారు. స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడుగురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీకృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి పాల్గొన్నారు. పనితీరులో నిర్లక్ష్యం కనబరిచినా, కాలయాపన చేసినా, అవినీతికి పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బియాండ్ ఎస్‌ఎల్‌ఏ 14 ఉండడం పై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి శ్రీకాకుళం ఆర్డీఓ, పొందూరు, కొత్తూరు తహసీల్దార్లు, ఆమదాలవలస(పోలీస్) ఎస్‌హెచ్‌ఓ, కలెక్టరేట్ సిబ్బందికి ఇద్దరు, డీఎస్పీ కార్యాలయం క్లర్క్‌కు కలిపి ఏడుగురికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ వారం స్పందనకు మొత్తం 198 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్ రామన్, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాదరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## రాయితీపై డ్రమ్ సీడర్ యంత్రాలు



డ్రమ్ సీడర్ పనితీరు పరిశీలిస్తున్న హరిబాబు

రణస్థలం:

రాయితీపై డ్రమ్ సీడర్ యంత్రాలు రైతులకు అందజేస్తున్నామని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు వెల్లడించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రణస్థలంలో ఫెర్టికమ్ సీడ్ డ్రీల్ యంత్రం, డ్రమ్ సీడర్ యంత్రం ద్వారా సాగవుతున్న వరి సాగును సోమవారం క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ముందస్తుగా మేలుకొని వేసవి దుక్కులు పూర్తి చేసుకోవాలని సూచించారు. తమ సంస్థ ద్వారా 50 శాతం రాయితీపై యంత్రాలు అందిస్తున్నామని.. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సమన్వయకర్తలు పి.రమణ, ఎస్.పి.నారాయణరావు తదితరులు ఉన్నారు.

## వైఎస్సార్‌సీపీ కార్యకర్త సామాజిక బాధ్యత



టెక్కలి గోపీనాథపురంలో కాలువలో దిగి శుభ్రం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త సత్తారు సూరిబాబు

టెక్కలి: టెక్కలి గోపీనాథపురం ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సత్తారు సూరిబాబు తన సామాజిక బాధ్యతను నెరవేర్చారు. ఈ ప్రాంతంలో గల మురుగు కాలువల్లో మురుగు నిల్వలు పేరుకుపోయి ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో సూరిబాబు మురుగు కాలువలో దిగి శుభ్రం చేశారు. ఆయనకు స్థానికులు కూడా సాయం చేశారు.

## స్పందన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



ఫిర్యాదుదారుడిని సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : స్పందనలో వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ జీఆర్ రాధిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆమె పాల్గొని అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామిలు ఉన్నారు.

## శ్రీకాకుళంలో జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం బలగ ఆస్పత్రి జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణ కేంద్రంలోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఈనెల 19వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ సోమవారం తెలిపారు. జయభేరి ఆటో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ తోపాటు మెడ్‌ప్లస్ ఫార్మసీ కంపెనీల్లో వివిధ పోస్టుల భర్తీ కోసం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జయభేరి కంపెనీ కోసం ఏదైనా డిగ్రీ, ఐటీఐ (మెకానికల్), డిప్లమో (మెకానికల్), బీటెక్ (మెకానికల్) పూర్తిచేసి 19 నుంచి 38 ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారు అర్హులన్నారు., ఎంపికైన వారికి రూ. 11 వేల నుంచి 22 వేల రూపాయల వరకు జీతం, ఇతర అలవెన్సులు ఉంటాయన్నారు. ఎంపికైనవారు శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. మెడ్‌ప్లస్ కోసం టెన్త్‌క్లాస్, డిప్లమో/యూజీ/మాస్టర్ ఫార్మసీ పూర్తిచేసి 40 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి వివిధ స్థాయిలను బట్టి రూ. 9084 నుంచి 15 వేల వరకు జీతం, ఇతర అలవెన్సులు ఉంటాయన్నారు. ఎంపికైనవారు శ్రీకాకుళం, వీరఘట్టం, విశాఖపట్నంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ యువత బుధవారం ఉదయం పది గంటలకు డీఎల్‌టీసీ శిక్షణ కేంద్రం వద్దకు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, మూడు పాస్ సైజ్ ఫొటోలతో నేరుగా హాజరు కావాలని సూచించారు.

## డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించాలి



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఏఫిలియేషన్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు కోరారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో రిజిస్ట్రార్ సి.హెచ్.ఎ.రాజేంద్రప్రసాద్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నాల జయరాంతో కూడిన బృందం సోమవారం కలిసి తమ సమస్యలను తెలియజేశారు. ఫీజుల నియంత్రణ పర్యవేక్షణ కమిషన్ నిర్ణయించిన ఫీజు స్ట్రక్చర్ పర్యవేక్షించాలని కోరారు. 25 శాతం కనీస ప్రవేశాల నిబంధన వల్ల జిల్లాలో ఆరు కళాశాలల్లో ప్రవేశాలు నిలిచిపోతున్నాయని, ఒకప్పుడు ఈ కళాశాలలు మెరుగ్గా నడిచేవని వివరించారు. ఈ కళాశాలల్లో ప్రవేశానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కనీస ఫీజు స్ట్రక్చర్ ఏడాదికి రూ. 20 వేలు నిర్ణయించాలన్నారు.

## క్రైమ్ కార్నర్

### మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్య



విశ్వనాథరావు మృతదేహం

పొందూరు: మనస్తాపంతో వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పురుగుమందు తాగి పొందూరుకు చెందిన చింతాడ విశ్వనాథరావు (68) ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు సోమవారం తెలిపారు. పట్టణంలోని సీహెచ్‌సీ సమీపంలో విశ్వనాథరావు, భార్య సత్యవతి నివసిస్తున్నారు. విశ్వనాథరావు మద్యానికి బానిస కావడంతో దంపతుల మధ్య తరచూ తగాదాలు జరుగుతుండేవి. ఆదివారం మధ్యాహ్నం కూడా వీరి మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన విశ్వనాథరావు పురుగు మందు తాగేసి నురగలు కక్కుతూ పడిపోయాడు. దీంతో అతన్ని 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తరలించామన్నారు. భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఐటీఐ విద్యార్థి మృతి



ప్రమాద దృశ్యం

మందస: మందస మండలంలోని మఖరజోల గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐటీఐ విద్యార్థి నెయ్యిల గణేష్‌బెహరా (18) ప్రాణాలు కోల్పోయాడు. కంచిలి మండలం పూర్ణకాసనం గ్రామానికి చెందిన గణేష్ కొళియాబెహరాతో ఐటీఐ పరీక్షలు రాయడానికి ద్విచక్ర వాహనంపై పలాస వెళ్తున్నాడు.

మఖరజోల వద్ద ఎదురుగా వస్తున్న లారీని క్రాస్ చేయబోయి సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన గణేశ్‌ను తొలుత పలాస ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మందస ఎస్సై వై.రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గణేశ్ మృతదేహానికి రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించామన్నారు.

### గల్లంతైన యువకుడు శవమై తేలాడు

సోంపేట: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం గ్రామానికి చెందిన యువకుడు కె.నవీన్ ఆదివారం శివసాగర్ బీచ్‌లో గల్లంతయ్యాడు. ఇతను చనిపోయినట్టు పోలీసులు వెల్లడించారు. నవీన్ మృతదేహం మేజర్ పంచాయతీ బారువ కొత్తూరు తీరానికి సోమవారం కొట్టుకొచ్చినట్టు బారువ ఎస్సై చిరంజీవి తెలిపారు. మృతదేహాన్ని చూసిన అతని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్లో) నవీన్(ఫైల్)

## అదుపుతప్పిన బైక్

- వ్యక్తికి తీవ్రగాయాలు
- తెగిపడిన కుడి కాలు
- ప్రమాదంపై ఆరా తీసిన ఎస్పీ రాధిక



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంతోష్‌కుమార్

టెక్కలి రూరల్: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకున్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనలో అతని రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. ప్రమాదంపై జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆరా తీశారు. ఈ ఘటన చాకిపల్లి గ్రామ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని సింధియా ప్రాంతం జయంద్రకాలనీకి చెందిన బైపల్లి సంతోష్‌కుమార్ ద్విచక్ర వాహనంపై అత్తవారు గ్రామమైన వజ్రపుకొత్తూరు మండలం కంబాలరాయుడుపేట వెళ్లి తిరిగి వస్తున్నాడు. టెక్కలి సమీపంలోని చాకిపల్లి గ్రామ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంతోష్‌కుమార్ కుడి కాలు పాదం తెగిపడిపోగా.. ఎడమకాలు నుజ్జయింది. సమాచారం తెలిసిన వెంటనే హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ జి.ఆర్ రాధిక ఆరాతీశారు. స్థానిక పోలీసులతో మాట్లాడి క్షతగాత్రుడుకి మెరుగైన వైద్యం అందేలా చూడా లని సూచించారు. టెక్కలి ఎస్సై రామకృష్ణ గాయపడిన సంతోష్‌కుమార్‌ను దగ్గరుండి 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడు వ్యక్తి ప్లంబర్‌గా పనిచేస్తుంటారు.